పులి వేట

శ్రీ యాముజాల శంకరం

దట్టమయిన, భయంకరారణ్యం. ఎత్తైన కొండలు, లోతైన లోయలు, వాగులు, వంతలు. ఆ కీకారణ్యంలో కాలిబాట సన్నగా పోతూ ఉంటుంది; తిన్నగా కాకుండా కొన్ని పొదల్లోంచి, తుప్పల మధ్యనుంచి పోవడం కద్దు. అమావాస్య చీకట్లో అర్ధరాత్రి పోతూ ఉంటే పదిగజాల దూరంలో ఏముందో ఎలా గ్రహించలేమో, అలానే మనకు దగ్గరలో మసలే జంతువును కూడా కనిపెట్టడం కష్టం.

1952 వ సంవత్సరం నవంబరు ప్రాంతంలో సత్యం, సుందరం యీ దారివెంట వెళ్లుతున్నారు. సత్యం మంచి వేటగాడు. ముందు కోయదొర సామానుతో నడుస్తున్నాడు. వెనుక సత్యం లోడ్ చేసిన తుపాకితో నడుస్తున్నా సుందరానికి బిక్కు బిక్కుమంటూనే ఉంది. ఆ దారివెంట పోతూ ఉంటే అనేక దార్లు కలుస్తున్నాయి. బహుశా కోయదొర లేకపోతే ఏదారిని పోవాలో నిర్ణయించటం చాలా కష్టం. దట్టంగా ఉన్న దుప్పులు గుంపులు గుంపులుగా కనుపించాయి. కేరింతలు కొడుతూ కాలికొద్దీ పరుగెత్తుతున్నాయి అడవి గొఱ్ఱెలు. కొమ్ములతో తీవలను చిదిలించుకుంటూ దున్నపోతుల్లా దూసుకొని పోతున్నాయి—కణుజులు. మనుష్యుల్ని పసిగట్టి పలాయనం చిత్తగిస్తున్నాయి. మరొకనాడైతే కొన్ని హతమైయుండేవి. కాని యీ పోతున్న మనుష్యుల ఉద్దేశం వేరు

మారుమూల, కుగ్రామాల్లో, మనుష్యుల్ని చంపే పెద్దపులి (మానుపులి) విచ్చలవిడిగా విహరిస్తోంది. ఇంటికొకరో, యిద్దరో బెబ్బులి కాహుతౌతున్నారు. ఉదయం ఏడున్నర గంటలప్పుడు ఊరి దాపులోఉన్న పదేళ్ళ కుర్రాడిపై బడి, పట్టి తీసుకొనిపోతూ ఉంటే అంతా గొల్లుమన్నారు. ఈ విషయాలన్నీ తెలిసే కాబోలు ప్రభుత్వం దాన్ని చంపినవారికి బహుమతి యిస్తామని ప్రకటించింది.

అయితే బహుమతి దృష్టిలో పెట్టుకొని సత్యం బయలుదేర లేదు. కాకపోతే ఒక్క దెబ్బకే రెండు పిట్టలు రాలవచ్చు. తరుచు తను ఏ గ్రామాలకైతే వేట నిమిత్తం వెళుతూ ఉంటాడో ఆ గ్రామాల్లో యిది తిరగటం, ఇలాంటి పులిని చంపాలన్న అభిలాష...ఆ సరదాతో బయలుదేరాడు. సుందరానికి తుపాకి పట్టుకోవడంకూడా రాదు. ఇంటిదగ్గర కూర్చుని ఏవో కథలు, గేయాలు రాసి పత్రికలకు పంపుతూ ఉంటాడు. అయితే అన్నీ తిరిగి తనవద్దకే చేరుతూ ఉంటాయి. దానికి కారణం యీ పత్రికాసంపాదకులు తను వెలిబుచ్చిన అమూల్యభావాలను గ్రహించలేకపోవడమే. అందుకని యిహ ఏపత్రికకూ పంపకూడదనుకుంటాడు. ఏదైనా కథగాని, గేయంగాని తిరిగి వచ్చినరోజున యీ ఉద్దేశ్యం ఎక్కువయి, యీ మాట పదిసార్లన్నా అనుకుంటాడు; కాని మళ్ళీ పంపుతూనే ఉంటాడు. ప్రస్తుతం ప్రకృతిమాతి వొడిలో పరవశమౌదామని వద్దన్నా వినకుండా బయలుదేరాడు. తనిప్పుడు రచిస్తున్న ఖండకావ్యంలో ప్రకృతికి ప్రాధాన్యమివ్వాలని లోపలి ఉద్దేశం. బహుశా అతని మెదడులో చాలా పేజీలు నిండిఉంటాయి

"అదేమిటి ? ... ఇక్కడ నీళ్లు జరజర పారుతున్నాయి. మరి యిందాకటి సెలయేటిలో ఎందుకు లేవు?..." పోతున్నవాడల్లా ఆగిపోయి సత్యాన్నడిగాడు.

"దీన్ని 'తోగు'—అంటారు. దీనికి జల [ఊట] కొండపైన ఎక్కడో ఉంటుంది. ఇది మున్నూట అరవైఅయిదురోజులు పారుతూ ఉంటుంది. ఇందాక మనం దాటివచ్చింది 'వాగు'. అది వర్షపునీటికే పారుతుంది. పెద్ద పెద్దవర్షాలు కురిశాయంటే చాలా ప్రమాదకరంగా ప్రవహిస్తుంది. వట్టిరోజుల్లో ఒక్క చుక్క ఉండదు."

ఈ దృశ్యాలన్నీ చూస్తూంటే సుందరానికి ఎంతో ఆశ్చర్యంగా ఉంది. ఆ కుగ్రామాలను చూచి

విస్తుపోయాడు. ఒకేఒకయింటికో ఓగూడెం ఉంది; దానికో పేరు. ఈ ఇళ్లుకూడా అక్కడో నాలుగు; ఇక్కడో ఎనిమిది. దానికో పేరు; దీనికో పేరు. వీళ్లు ఎట్లా ఉంటున్నారా అన్న అనుమానం పీడించిందతన్ని. 'మనుష్యులేనా!' అనుకున్నాడు కూడాను.

ఇవన్నీ చూచినతరువాత వాళ్ల ఆచారవ్యవహారాలనుగూర్చికూడా తెలిసికోవాలని బుద్ధి పుట్టింది. సత్యం చెప్పాడు: సమతలప్రదేశమే కాకుండా యీ ప్రజ కొండలమీదా, గుట్టలమీదా అక్కడక్కడ చెట్లూ, పుట్టా కొట్టి, కాల్చి ఇంతస్థలం బాగుచేసి త్రవ్వి కొండజొన్న అవీ చల్లుతారట. దాన్ని 'పోడు' అంటారట. పోడు కింత శిస్తు అని కూడా ఉన్నట్టే జ్ఞాపకం.

ఆ పోళ్లను చూస్తూంటే మతులు పోతున్నాయి సుందరానికి. నట్టడివిలో పిట్టలపాలు కాకుండా డబ్బాలు మ్రోగిస్తూ, అడవిపందులు అంకురాలు తొలగించకుండా అరుస్తూ, క్రూరమైన అడవి జంతువులు విచ్చలవిడిగా తిరిగే స్థలంలో, ఆవంతయినా అధైర్యపడకుండా అదలిస్తూ, దయ్యాలకు భూతాలకు జడవకుండా, కూత మేరలో మనిషి లేకపోయినా, చూపు మేరలో యిల్లు లేకపోయినా, ఆ జొన్నమధ్య వేసిన మంచెమీద నిలచి కాచే ఆ అడవిమనిషికి—అడవి జంతువుకు, కేవలం ఆకారం, బలంలోమాత్రమే తేడా ఉంది. బ్రహ్మాండంగా పండితే రెండు బస్తాలు రాలుతాయా!

"వీళ్లూ మనుష్యులేనా!"—మరోసారనుకున్నాడు.

ఈ కొండ దాటితే వాళ్లు వెళ్లే గూడెం వస్తుంది. కాని యీ దారి కొండమధ్యగా పోతోంది. ఇక వేరే దారి లేదు. సరిగ్గా మధ్యలో రాతి నానుకొని పోతోంది దారి. కొండ ఖచ్చితంగా దిగిపోయింది. అమధ్య ఎట్లా దారిచేశారో! కోయదొర దాటిపోయాడు చాలా తేలిగ్గా. క్రిందికి చూస్తే కాలుజారితే శరీరంలో ముక్క కనుపించదు. దారి చాలా సన్నగా ఉంది. రాయి పట్టుకుంటూ గుండ్రంగా ఒక బారెడు దూరం నడవాలి. తరువాత మామూలుగా వెళ్లివచ్చు.

"వేరే దారి లేదా? ..." అడిగాడు సుందరం.

"అబ్బో! ఆ దారిన పోతే అదనంగా అయిదు మైళ్ళు నడవాలి. అసలు అయిదు మైళ్ళే ఇట్లా ఉంటే, పది మైళ్ళేమి నడుస్తాం?"

"నాకు చాలా భయంగా ఉంది."

"ఇంతేనా మరి?"

సత్యం దాటాడు కాని వళ్ళంతా ముచ్చెమట పోసింది. సుందరం మధ్యలో కెవ్వున అరచాడు. సత్యం గజ్జున వణికిపోయాడు—ప్రమాదం జరిగే ఉంటుందని.

"కండ్లు తిరుగుతున్నాయి."

"కండ్లు మూసుకో. క్రిందా, పైనా చూడకు. దారి చూచుకుంటూ వచ్చేయి. నా టార్చను కిదొక లెఖా, భయపడకు. ఎందుకురా వణకుతావ్. అమ్మయ్య! చుట్టుఅయినా యీ దఫా ఆదారినే పోదాం."

ఊరిబయట నిర్మించబడిన రహదారి బంగళాలో దిగారు. దిగీదిగగానే పటేలుకూతురు 'బోడి'-పరుగెత్తుకుంటూ వచ్చింది. ఒక గ్రామానికి గాని, రెంటికి గాని ఒకమునసబు ఉంటాడు. అతన్ని పటేలని పిలుస్తారిక్కడ. అతనే కులపెద్ద. అతని మాట అంతా వింటారు.

"మా సత్తెం దొరొచ్చిండు"-అంటూ చప్పట్లు కొడుతూ, సంతోషంతో గెంతుతోంది. సత్యం నవ్వాడు. బొద్దుగా గుండ్రానికి కాళ్లు వచ్చినట్లు భూమికి జానెడెత్తున్న ఆ కోయపిల్ల అలా కేరింతలు కొడుతూఉంటే సుందరానికి చూడ ముచ్చటగా ఉంది. చిలిపిగా నవ్వాడు.

"బోడీ"—సత్యం పిలచాడు.

"ఏం దొరా..."

దీనిపేరు 'బోడి'ట. అనుకున్నాడు సుందరం. అందుకే గాబోలు నెత్తిమీద జుట్టులేదు.

"ఏమిటే విశేషాలు ?"

పులివల్ల ఎన్ని యిండ్లు ఎంత శోకసముద్రంలో మునిగి ఉన్నాయో, ఎంతెంతమంది ఎలా చచ్చారో, ఈ విషయాలన్నీ చెబుతూ ఉంటే, ఆ అమాయకురాలికి దుఃఖం పొంగి పొరలింది. తన అన్న 'ఈరడు' ఎట్లా చచ్చాడో కూడా వివరించింది. దీన్ని ఎట్లాగైనా చంపమని ప్రార్థించింది. ప్రొద్దున్నా ఎండ పాకేముందు, సాయంకాలం చీకటిపడినాక ఎవరూ ఇల్లు వదలి బయట అడుగుపెట్టటం లేదట. పగలు రాదుగాని అప్పుడప్పుడు రాత్రిపూట గూడెంలోకి కూడా వస్తోందట.

బోడి జాగా అంతా చిమ్మింది. నీళ్లు చల్లి, ముగ్గులు పెట్టింది. నీళ్లు తెచ్చి; కుండలన్నీ నింపింది. ఎంతో సంతోషంతో ఆ పనులన్నీ చక్కగా, శుభ్రంగా చేసింది.

"నిన్నెవరో ఎత్తుకుపోతారు లే!..."—హాస్యం పట్టించినట్టు అన్నాడు సత్యం. బోడి కింకా పెండ్లి కాలేదు; కాని అలా కనిపించదు. సంప్రదాయం ప్రకారం పెండ్లినాడు పెండ్లికొడుకు పెండ్లికూతుర్ని ఎత్తుకొనిపోతాడు.

"పో దొరా!"—కిలకిల నవ్వుతూ బోడి పరుగెత్తింది.

"పిచ్చిది. పట్టి అమాయకురాలు"—అన్నాడు సత్యం.

వ్యంగ్యంగా నవ్వాడు సుందరం.

"ఎందుకలా నవ్వుతున్నావు."

చాలా సేపు గడిచిపోయింది.

"అభాగ్యులు"—మెల్లగా మొదలు పెట్టాడు సత్యం. "బోడివిషయంలో చూడు. ఇదివరకు నేను వచ్చినప్పుడు చాలా అసహ్యంగా ఉండేది. ఆరోగ్య సూత్రాలన్నీ చచ్చేటట్టు చెప్పాను. కనీసం నేను వచ్చినప్పుడైనా రెండుపూటలా స్నానం చేయమని ఉతికినగుడ్డలే కట్టుకోమని బ్రతిమాలాను. ఆఖరికి భయపెట్టాను. ఇప్పుడు కొంచెం నయం.

"చూడు? అనాకారి కాదు," అందకత్తె అసలే కాదు. ఎర్రటిరంగు; కాని ఆరంగులో అందం లేదు, కొట్టవచ్చినట్లుంటుంది. పెద్దకండ్లు. కాని ఆ కండ్లలో చిలిపితనం లేదు, అమాయకత్వముంది. ముఖంలో లావణ్యం లేదు మొరటుతనముంది. అది వాళ్ళకందరికీ సహజంగా ఉంటుంది. దృఢమైన కండలు తిరిగినశరీరం. అందులో నువు వర్ణించే వంపుసొంపులు, తళుకు బెళుకులు లేవు. అయినా బెర్నార్డుషా నాటకంలోలా తీసుకొనిపోయి, పోషణచేసి, బోధించి నేర్పి నాలుగు వస్త్రాలు తగిలించి మన సమాజంలో వదిలేస్తే... మగాళ్లు బిత్తరపోరంటావా?"

రెండు సిగరెట్లూ కాల్చబడుతున్నాయి. కొంచెంసేపు నిశ్శబ్దంగా గడిచిపోయింది. దమ్ముపీల్చి, పొడిదులిపి, పొగ వదులుతూ సత్యం మళ్ళీ మొదలు పెట్టాడు:

"మనసమాజంలోలా వాళ్లల్లో యీ అనుమానాలకూ వాటికి తావులేదు. ఏకపత్నీత్వం, ఏకభర్తృత్వం వాళ్ళల్లోనూ ఉంది. భార్యచాటున భర్త, భర్త చాటున భార్య నీచానికి పాల్పడి చెడుతిరుగుళ్లు తిరగటం లేదనే చెప్పాలి. నాగరికత శిఖరాగ్రానికి చేరబోతున్న యీ రోజుల్లో మనం ఏది కావాలని చట్టాలు, కోర్టులు నిర్మించుకుంటున్నామో, ఆ విడాకులు వీళ్ళల్లో అనాదిగా వస్తున్న ఆచారం. పడనప్పుడు కులపెద్ద విధించిన కులతప్పు చెల్లించి, మరో భార్యనో, భర్తనో కుదుర్చుకునే అవకాశం వాళ్లకుంది. అంతేగాని మనలాగా ఇద్దరు మాట్లాడితే మాటలకు అపార్థాలు, పెడర్థాలు తీయటం వీళ్లల్లో లేదు. అసలలాంటి దురూహలు వాళ్ళకు కలుగవుకూడాను.

"అయితే అవకాశం ఉందికదా అని రూపాయి నూటతొంభై రెండు పైసల్లోకి మారుస్తారనుకుంటున్నావుకదూ ... చాలా పొరపాటు. మారు మనువు (మరో పెండ్లి) అసలు లేకుండానే జీవితాలు కట్టుబడి ఉన్నవాళ్లు ఉన్నారు. చేసుకున్నా తప్పులేదు గాని, ఒకటి రెండుకంటె ఎక్కువ మారుమనువులసలు ఉండవు."

సాయంకాలం కావటంమూలాన కాఫీ వేళయింది. సత్యం తనతో తెచ్చుకున్న బిస్కట్లు, కేకులు, రొట్టెలు—కొన్ని బోడికి కూడా పెట్టాడు. కాఫీకూడా యింత పోశాడు. బోడి ఆనందానికంతు లేదు.

"బోడీ!..."

"ఏం దొరా!......"

"నువు కాస్త గెంతటం తగ్గించి, నడవటం నేర్చుకో."

బోడి నడుస్తున్నా గెంతినట్లుంటుంది. ఇద్దరూ విరగబడి నవ్వారు. బోడి సిగ్గుతో బయటకు పరుగెత్తింది.

"నేను వస్తే బోడి యిల్లే మరచిపోతుందిరా సుందరం!...తియ్యతియ్యటి పదార్థాలు దానికి దొరుకుతా యిక్కడ. వాళ్ళెప్పుడన్నా యిలాంటివి తిన్నారా, ఏడిశారా. చింతగింజల అంబలి, మామిడిజీళ్ళ అంబలి, ఇలాంటి అసహ్యకరమైన పదార్థాలతో పొట్ట నింపుకుంటారు. ఇహ ఎండాకాలం

వచ్చిందా మామిడిపండ్ల రసం త్రాగి ఉంటారు. ఆ పండ్లు చాలా చిన్నవి. అందుకే 'గొఱ్ఱెమామి' డంటారు. ఇహ కల్లు ముంతెడు ముంతెడు తాగి ఉంటారు.

"నీ కేం—గో ఉందికదూ. మరి అదే వాళ్ళ జీవితం. కొత్తవాళ్లకిదంతా ఆశ్చర్యంగానూ, అతిశయోక్తిగానూ ఉంటుంది."

పులిజాడలేమైనా దొరుకుతాయేమోనని పక్కగా ఉన్న చిన్న గుట్టకు బయలుదేరారు.

ఊరిచుట్టూ చిట్టడవి. అనేక రకాల చెట్లు, తీగెలు, పూలచెట్లు, పొదరిండ్లు, పెద్దపెద్ద వల్మీకాలు చిన్నచిన్న నీటిమడుగులు. సంధ్యాకిరణాలు ప్రతి దానిమీద పడి ప్రతిబింబిస్తున్నాయి.

ఆచిన్నకొండ కొంచెం పైకి ఎక్కారు. మాటల వినికిడివల్ల మీదపడే పులివాత తప్పించుకోవడానికి సత్యం తుపాకి లోడుచేసి దగ్గర ఉంచుకున్నాడు.

అక్కడినుంచి చూస్తే దూరదూరంగా ఉన్న రెండు గూడాలు కనిపించాయి. అల్లంత దూరంలో ఎత్తైన కొండ ఒకటి కనిపిస్తోంది. చల్లని గాలి వీస్తోంది. నువ్వు, కంది, జొన్న అక్కడక్కడా చిన్న చిన్న మళ్లలా కనిపిస్తోంది. దూరాన పశువులను మళ్ళించుకొని యిళ్లకు వస్తున్నారు — కాపరులు.

దూరాన ఎండిపోయిన వాగులో ఇసుకతిన్నె మీద, అస్తమించే అవతారమూర్తికి అంకితం చేస్తూ తన పింఛం విప్పి ఆనందోత్సవం చేస్తోంది నెమలి. ప్రక్కనే ఉన్న నెమలిపెట్ట (ఆడది) నెమలి విడిచే ఆనందబాష్పాలను అమృతబిందువుల్లా ఆస్వాదిస్తోంది. అదే వాటి సమాగమం. కవి హృదయం పులకించింది.

ఇళ్ళకు మళ్లారు.

తిరిగి వచ్చేసరికి వంటవాడు చలపతి వంటా, అదీ చేసి, ఆరుబయట మంచంమీద వెల్లకిలా పడుకొని, "జగమే మాయా"—సొంతరాగంలో ఆలాపిస్తున్నాడు. వీళ్లు యిట్లా వెళ్ళటం, చలపతి అట్లా వచ్చి ఉండటం జరిగింది. వంట సామానుతో చలపతి, మరో కోయదొర వెనుక దిగబడిపోయారు.

చలపతి మహా చిలిపి. తన గొంతుగురించి, పాట గురించి, ముఖ్యంగా తన్నుగురించి బ్రహ్మాండంగా కోసిఉంటాడు. అందుకనే కాబోలు బోడి నోరు తెరచుకొని వింటూ కూర్చుంది.

భోజనాలయ్యాయి. ఇంతట్లోకే బయట, డప్పుల మోతలు మొదలయ్యాయి. కెవ్వున ఉండుండి అరుస్తున్నారు.

సుందరమడిగాడు "ఏమిటది?..."

"కొలుపు లెండి. మీకు తెలవదా?..."—చలపతి.

సత్యం అందుకున్నాడు. "రారా— చూపిస్తాను. చాలా గమ్మత్తుగా ఉంటుందిలే. వాళ్లు ఎగురుతూఉంటే చూచి భయపడకేం. ఏం ఫరవాలేదు.."

"ఛా! ఛ! నాకేం భయంరా."

"అల్లానే అను. తరువాత తెలుస్తుంది."

ముఖానికి యింతంత కుంకుమ పూసుకుని, చేతిలో వేపమండలు పట్టుకొని, అప్పుడప్పుడు పసుపు పైకి విరజిమ్ముతూ, కెవ్వు కెవ్వున గావుకేకలు పెడుతూ, గెంతుతున్నారు కొందరు. ఊరిమధ్య రావిచెట్టు క్రింద జరుగుతోంది కొలుపు. చుట్టూ జనం ఉన్నారు. రెండుమూడు దివిటీలు వెలుగుతున్నాయి. చేతిలో పెట్టిన పసుపు, వేపఆకులతో కలిపి, కొందరు పంచదారలా బొక్కేస్తున్నారు.

సత్యం చెప్పాడు. మాలక్ష్మమ్మ, ముద్దిరావమ్మ, వనం పోతురాజు, పీనుగుల మల్లయ్య, దండుమారి— ఓ నూటొక్క దేవరట అవి మనుష్యులమీద ఇలా ఆవేశిస్తాయట.

మట్టి ముంతలో యింత నిప్పు ఉంది. గణం పూనగానే అందులో యింత సాంబ్రాణివేస్తే, ఆ పూనిన వ్యక్తి ఆ పొగను ఎగపీల్చి వదిలేస్తున్నాడు.

చలపతి చెప్పాడు. మధ్యాహ్నం దగ్గరనుంచి మొక్కుబడులన్నీ చెల్లించుకోవడం అయిపోయిందట. గున్నపోతులు, మేకలు, గొఱ్ఱెపోతులు ఎన్నో ఎగిరిపోయాయట. ఇహ కోడిపిల్లలు లెఖలేదట. ఈ విధంగా యీ కొలుపు తెల్లవార్లూ సాగుతుంది.

"వీళ్లు మనుష్యులేనా!..."—మరోసారి అనుకున్నాడు సుందరం. తిరిగివచ్చి బెడ్డింగుపరచి ముసుగుతన్ని పడుకున్నాడు.

జాతర చాలా రోజులుంటుంది...కొలుపు ఒక్క రోజు.

* * * *

ఆ తరువాత మూడురోజులు గడచిపోయాయి. పులిజాడ జవాబులేదు. అందువల్ల ఎక్కడ మాటు

కట్టాలో అర్థం కాలేదు. కోయవాళ్లు చెప్పిన స్థలాలన్నీ వెతికారు. ఏమీ లాభం లేకపోయింది. చికాకు పుట్టింది. తెచ్చుకున్న పదార్థా లయిపోయాయి.

రాత్రి సగం జరిగింది. బ్రహ్మాండమైన కోలాహలం వినిపించింది. త్రుళ్లిపడి లేచా రిద్దరూ. తుపాకి లోడు చేసుకొని, బ్యాటరీలైట్లు వేసుకొని గబగబా బయలుదేరారు. వీధుల్లో ఎక్కడా ఎవరూ లేరు. ఇళ్ళల్లోంచే గొల్లుమని గోల వినుపిస్తోంది. పరిసరాలు జాగ్రత్తిగా చూసుకుంటూ అసలు యింటి ముందుకొచ్చారు—ప్రమాదం గుర్తించకుండా.

వాళ్లు చెప్పినదాన్ని బట్టి విషయమిది: ఒక పూరి పాక. చాలా చిన్నదికూడాను. ఆ పాకలో ఉన్న ఒకే ఒక వెలుగు — చలిమంట. భార్య, భర్త, పసిపిల్లాడు — ముగ్గురే కాపరం. పెద్దపిల్లాణ్ని వెనకే పులి తినేసింది.

చంటిపిల్లాడు లేచి ఏడవటం మొదలు పెట్టాడు. తల్లి పిల్లాణ్ని వళ్లో కూర్చోబెట్టుకుంది అందుకోసంగాను కాళ్లు చాచి, ఎడమకాలుమీద కుడికాలుంచి పాలిస్తూ, ఆ కుడికాలూపుతూ చలి కాసుతోంది. భర్తా, తనూ యాడాలాపంగా ఏదో మాట్లాడుకుంటున్నారు. అయితే యీవిడ కాళ్లకు యించుమించు తగులుతూ ఉన్నట్టుగా ఉంది దడి (పాకచుట్టూ గోడమాదిరిగా తడిక అల్లినట్లు అల్లుతారు. ముట్టిమేగని దాన్ని దడి అంటారు).

వీళ్ళ మాటల సవ్వడి విని ఎప్పుడు వచ్చిందో, వచ్చి దడినానుకొని కూర్చుంది—అవలప్రక్క పెద్దపులి. ఈవిడ కాలుకు పులికి ఉన్న మధ్య దూరం అడుగు, అడుగున్నర. ఆ కాలుమీద దృష్టి నిల్పి, తదేకంగా చూస్తూ కూర్చొని ఉండిఉంటుందా పులి. పిల్లాడు నిద్రపోయాడు. తనూ పడుకుందామని ఆవిడ కాళ్లు మడిచింది. ఉన్న ఒకే ఒక అవకాశం జారిపోవడంవల్ల కోపంతో గర్రుమంది.

త్వరలో కని పెట్టగల కోయవాళ్ళు పసిగట్టి అర్చారు. దడిని రాసుకుంటూ చిట్టడవిలోకి పోయింది.

సత్యం లైటు వేసి చూచాడు. రోజూ చలిమంట బూడిదనంతా పాకప్రక్క పోయటం అలవాటు. ఆ బూడిదలో కూర్చుంది. ఇంతంత పాదాల గుర్తులు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

"ఎందుకిలా కూర్చుని ఉందంటావు?" అడిగాడు సుందరం.

"ఎవరైనా పొరబాటున బయటకు వస్తే పైనబడి చంపివేయటానికి. మరి దాని కవకాశం ఏది?..."

వెంటాడుదామన్నాడు సత్యం. వద్దన్నాడు సుందరం.

* * * *

ఉండటమా, వెళ్ళటమా అన్న సందిగ్ధంలో పడ్డారు. దానికితోడు ఇవ్వాళ వాళ్లు అన్నం లేక చిక్కుడుగింజలు ఉడకబెట్టుకొని తినవలసివచ్చింది. దగ్గరలో పట్నం లేదు. అయిదారు మైళ్ళు నడచి, ఎనిమిది మైళ్ళు బండిమీద వెళితే గాని రాదు. మనిషిని పంపినా రెండు రోజులు పడుతుంది.

నాలుగైదు రోజుల్లో తిరిగివచ్చే నిర్ణయం చేసుకొని సామాను లెత్తించారు.

బోడి కనబడలేదు. ప్రొద్దున్నా తుడిచి, నీళ్లు చల్లి ముగ్గులు పెట్టి వెళ్ళిపోయింది. మళ్ళీ రాలేదు. బోడికి ఏదైనా యిచ్చి వెళదామని సత్యం అనుకున్నాడు. "రాకపోతుందా, వెళ్ళేలోపల—" అనుకున్నాడు. తుపాకి లోడు చేసుకొని, ఇన్ని తూటాలు దగ్గర పెట్టుకున్నాడు.

ప్రొద్దున్న ఎనిమిది గంటలు కాబోతుంది. సామాను లెత్తబోతున్నారు. ఉన్నట్టుండి "సత్తెం దొరా!"—అంటూ కేకలతో వచ్చిపడ్డారు జనం. గుట్టప్రక్క చేలో కందిచేను కోస్తున్న కోయలమీద పడిందట పులి. ఇహ కడమ వివరా లడగకుండా యిద్దరూ పరుగెత్తారు.

చేలో జనం హడలుతున్నారు. రక్తం చారలు అక్కడక్కడ కనుపిస్తున్నాయి.

"పటేలు కూతుర్ని పట్టకపోయిందే......" అన్నాడో కోయ.

"బోడినా!"— ఇద్దరి ముఖాలు ఒక్కసారి వివర్ణమయ్యాయి ఆశ్చర్యంతో. ఏదో తెలియని భయంతో అడిగారు. కాళ్లు తడబడ్డాయి.

నిశ్చేష్టులై నిలుచుండిపోయారు. రైలు పెట్టెల్లా, తెరమీది దృశ్యంలా ఏదో కండ్లెదుటు దొర్లిపోతోంది. కిలకిలా నవ్వుతోంది బోడి. అమాయకురాలు. ఇన్ని రోజులనుంచీ ఏ వ్యక్తిని వేళాకోళం పట్టిస్తూ,

పరిహాసాలాడుతూ, కాలం వెళ్ళబుచ్చారో, ఆ వ్యక్తి లేదు. బోడిమీద యిద్దరికీ అభిమానం ఎక్కువ.

ఏదో అపురూపమైంది పోయింది. ఒక వ్యక్తి గాని, ఒక సంఘటన కాని మనస్సుకు నచ్చుతుంది. హృదయంలో చాలా దగ్గర స్థానం ఏర్పరచుకుంటుంది. అప్పుడా వ్యక్తిమీద విపరీతమైన అభిమానం ఏర్పడుతుంది.

సత్యంకండ్లల్లో రౌద్రం తాండవించింది. మాటైనా లేకుండా ముందుకు సాగిపోతున్నాడు.

"ఎక్కడికిరా?" అడిగాడు సుందరం.

"రా రా..." అంతే. రెండో మాట లేదు. సుందరం చేసేదిలేక తనూ వెంటపడాల్సి వచ్చింది.

సత్యమయితే వెళ్ళిపోతున్నాడు — దూసుకుంటూ. అతనిదగ్గర ఆయుధముంది. తనదగ్గ రేమీ లేదు. ఉన్నా పేల్చటం రాదు. నట్టడవిలో ప్రవేశించినప్పుడు, నలుమూలలా అతి జాగ్రత్తగా చూసేమని సత్యం చెప్పాడొకనాడు. మాట్లాడకూడదు. కనీసం చప్పుడయేటట్టుగా కూడా నడవకూడదు. సమస్త భారం సత్యంమీద వేసి బయల్దేరాడు సుందరం.

హృదయమంతా బిక్కు బిక్కుమని కొట్టుకుంటోంది. ఎప్పుడు, ఎక్కడ, ఎట్లా మృత్యువు ఎదురౌతుందో చెప్పటం కష్టం. చాలా దూరం రానే వచ్చేశాడు. అయినా తనకీ వేట ఏమిటి? సరదా పుట్టి తను వచ్చాడే అనుకో! ఏమీ తెలియని అమాయకుడిని యిట్లా తన వెంట తీసుకొని పోతున్నాడే.

నేలమీద రక్తపుచార నానవాలు చేసుకుని సత్యం నడుస్తున్నాడు. ఆగిపోయాడు—ఒకచోట. నేలమీద చూచాడు సుందరం. ఇంత రక్తం పోసినట్లుగా ఉంది. నేలంతా అరంగుళం లోతున తడిసి ఉంది. బహుశా అక్కడ పులి మొదటిపట్టు వదిలి, మరో ఘట్టి పట్టు పట్టి ఉంటుం దనుకున్నాడు.

ఆ పైన సత్యం చాలా జాగ్రత్తగా పరిసరాలు, నేల చూస్తూ నడుస్తున్నాడు. తన కేమీ అర్థం కావడం లేదు. అయినా తనూ చూస్తున్నాడు. ఎక్కడ, ఎంతదూరంలో, ఎలాంటి శబ్దమయినా, గుండె ఝల్లుమని, వళ్ళంతా దిగచెమటలు కక్కుస్తోంది. "ఈవాళ నా జీవితానికి ఆఖరి రోజు"— ఈమాట తనిప్పటికి ఎన్నోసార్లనుకున్నాడు.

నేలమీద కేన్నో యీడ్చుకొనిపోయినట్టుగా అక్కడక్కడ చారలు కనుపించాయి. తన కేం అర్థం కావడం లేదు. ఇంకాస్త దూరం పోయారు. గట్టి నేల—ఆచారలూ లేవు. సత్యం పెదవి విరిచాడు.

చుట్టూ దట్టమైన అడవి కీ్రుమంటోంది. పక్షులన్నీ తెగ గోల చేస్తున్నాయి. ఎక్కడినుంచి వచ్చారో, ఎక్కడికి పోవాలో, ఎట్లా పోతే మళ్ళీ యథాస్థానానికి చేరుకుంటారో—సుందరాని కంతా అగమ్యగోచరంగా ఉంది. ఇంకా చేరుకోవడమేమిటి? బయటపడటం అసంభవంగా భావించాడు. పొరపాటున బయటపడటమంటూ జరిగితే పునర్జన్మ ఎత్తినట్లే. అయినా యింటిదగ్గర కూర్చుని ఏవో కథలు, గేయాలు రాసుకునేవాడికి తనకీ వేట ఏమిటి?

"ఇవ్వాళే ఆఖరురోజు" — ఈమాట తలపుకొచ్చినప్పుడల్లా గజ్జున వణుకుతూ, మనిషి తల్లడిల్లిపోతున్నాడు.

వంగి సత్యం ఓ గాజుముక్క పైకి తీశాడు. కాసేపాలోచించి అవతల పారేశాడు. సుందరం ఆ అమ్మాయిగాజు ఒకటి ఇక్కడ పగిలిఉంటుందని ఊహించగలిగాడు.

ఇంకొంచెం ముందు రాతి నేల; అన్నీ చిన్న చిన్న గుబురులు. ఆ పొదల్లో ఎక్కడుందో?

ఏంపసిగట్టాడో తెలియదుగాని, ఎదురుగుండా ఉన్న ఓ నిలువెడెత్తురాయి చాటుకు చటన సత్యం తప్పుకొని కొంచెం వంగి చూస్తున్నాడు. తనూ సత్యం ప్రక్కగా వరిగాడు. శరీరమంతా కంపమెత్తిపోతోంది. కొలుపులో దేవతలు ఆవేశించిన మనుష్యులు జ్ఞాపకానికొచ్చారు. నాలుక పిడచగట్టింది. లాలాజలం నాస్తి. వద్దనుకున్నా దుఃఖం ఆగటం లేదు. అరుద్దామంటే గొంతు రాదు. సర్వావయవాలు స్వాధీనం తప్పాయి.

సత్యం వ్రేళ్లు మీటమీద ఉన్నాయి. జోడుగుండ్లతుపాకి. ఏమాత్రం అవకాశంచిక్కినా సత్యం వదలుకునేటట్లు లేదు.

కాసేపట్లా కూర్చున్న సత్యం మళ్లా లేచాడు. తనూ లేచాడు. ముందుకు పోతున్నాడు సత్యం. తనకు గుండె ఆగినంతపనయింది. ఏదో అనుమానం తగలబట్టే కదూ సత్యం కూర్చుంది. చుట్టుప్రక్కల ఎక్క-

డయినా ఉంటే తమపనేం కావాలి. తనకు వేరే దిక్కేమీ లేదు. గబగబ పారుదామన్నా దగ్గరలో మంచి చెట్టే లేదు. తను సాంతం సత్యంమీద ఆధారపడ్డాడు.

ఇంతలో ఓ చిన్న పొదనుంచి యింత వెంట్రుకల తుట్ట బయటకు తీశాడు సత్యం. చేత్తో 'ఇల్లా పోయింది' అన్నట్టు సైగచేశాడు. తను తల బాదుకున్నాడు. బహుశా ఆ పొదలోంచి శవాన్ని లాక్కుపోయి ఉంటుంది. అందుకే వెంట్రుకలు వాటికి పట్టాయి.

సత్యం ఆ తుప్పలు దాటిపోతూ ఉంటే, అతని మొండిసాహసానికి తనకి చిరాకెత్తింది. అమాంతం ఎగిరి పులిలా మెడపట్టి పిసికి పారేద్దామన్నంతకోపం కూడా వచ్చింది. కాని...

గరువు నేల; తను మొట్టమొదట ఏ చారలైతే నేలమీద చూచాడో, అలానే ఏదో యీడ్చినట్లు చార కనుపిస్తోంది. సత్యం గబగబ నడచాడు. తనూ నడిచాడు.

సత్యం యింతకుముందు యింత వేగంగా నడవలేదు. బహుశా అతను చెప్పినవిషయం అతనే మరచిపోయి ఉంటాడు. మనుష్యునికంటె మృగం చాలా తెలివైంది. మనిష్ని ఎవరైనా చప్పట్లు చరిచి పిలిస్తే అసలు దిక్కు వదిలి, పదిదిక్కులు చూస్తాం. మృగా లట్లా కాదు. అసహజమైన శబ్దం ఏదన్నా వచ్చిందా, ఏదిక్కునుంచి వచ్చిందో, ఆ దిక్కుకు అన్నీ ఒక్కసారిగా తిరిగి చూస్తాయి.

కొండ దిగిపోయింది. మూడుదార్లు కలిశాయి. అక్కడో చిన్న చెట్టుంది. ఇంకొస్త పయిన వాగు. మధ్య రాళ్ళగుట్ట. చుట్టూ జిన్నెపొద. అందులో ఉంది శవం. పులి లేదు.

పొట్ట బాగా ఉబ్బింది. లోపల కూడుకున్న గాలి అప్పుడప్పుడు 'గస్'న నోటిద్వారా వెళ్ళిపోతోంది. ఉండి, ఉండి ముక్కుగుండా నల్లని రక్తపు బుడగలు తేలి 'టప్పు'న బ్రద్దలవుతున్నాయి. సర్వావయవాలు కొట్టుకొనిపోయి, కొన్ని చోట్ల ఎముకలు కూడా బయటబడ్డాయి. బట్టలు పేలికలైపోయాయి. నిశ్చేష్టులై కూలబడిపోయారు. బోడి ఊరికి రెండు మైళ్ళ దూరాన, వాగు తుప్పలో, ఆనవాలు పట్టలేనంతగా అయి, చచ్చి పడిఉంది.

మెత్తనిగుండెగల సుందరం, అంతా మరచిపోయి, పైకే అనేశాడు: "ఇంతేనా జీవితం...."

చాలాసేపు ప్రశాంతంగా గడచిపోయింది.

"మాటుకు అనువుగా ఉన్న చెట్టు అదొక్కటే" అతి మెల్లగా సుందరం చెవిలో చెప్పాడు సత్యం. మూడుదార్లు కలసేచోటుకు కొంచెం ప్రక్కగా ఉంది. వాగులోంచిగాని, ఎదురుదారినగాని పులి వచ్చిందా, ఫరవాలేదు. వెనుక గుట్టమీది దారిని వచ్చిందా దాని గుప్పిట్లో ఉంటారు. కొండ సరిగ్గా వాగులోకి దిగిపోయింది.

సత్యం దారితీశాడు. కొండపైదారి ఎక్కి అట్లా మలుపుతిరిగి నడిచారు. ఒక మైలుదూరంలోనే ఊరికి రాగలిగారు.

"ధైర్యస్థుడివేరా. భయపడి అరిచేస్తావేమో ననుకున్నాను...." అంటూ సముదాయించాడు సత్యం.

తన కామాత్రం ధైర్యముందని సత్యం వప్పుకున్నందుకు సుందరం నవ్వాడు—కొంచెం గర్వంగానే.

ఊరంతా తిరిగి దొరికిన ఒక ముసలి ఎద్దును, ఒక మేకను తెప్పించాడు సత్యం: "ఏరా! మాటుకు వస్తావా...." అడిగాడు.

అడవిలో అలా నడవగా లేంది, మాటులో కూర్చుంటే తనకేం ప్రమాదం. వస్తానని వప్పుకున్నాడు.

ఎదురుగుండా ఉన్న దారిలో మేకను కట్టించాడు. వెనుకదారిలో ముసలిఎద్దు. వాగులో శవం ఉండనే ఉంది. నాలుగుగంటలకే చెట్టెక్కి కూర్చున్నారు. చలికాలం కావడం మూలాన రగ్గులుకూడా తెచ్చుకున్నారు.

నిర్మానుష్యమైన యీ భీకరారణ్యంలో సత్యంతోపాటు మొండి ధైర్యంచేసి తనూ కూర్చున్నాడు. ఇక్కడ తనకేం ప్రమాదం సంభవించినా జాడా జవాబూ తెలుపటానికి కనీసం రెండు మూడు రోజులు పడుతుంది.

చూస్తూనే ఉన్నాడు సుందరం. కాని ఎప్పుడు ప్రొద్దు కూకింది, ఎప్పుడు చంద్రోదయమై వెన్నెలొచ్చింది, అరణ్యంలో కూర్చున్న తనేం గుర్తుపట్టలేకపోయాడు. పిట్టలరొద పలువిధాలుగా ఉంది. గూళ్ళకు చేరుతూ నోళ్ళు తెరచి తెగ అరుస్తున్నాయి.

వెన్నెల బాగా వచ్చింది. చలిగాలి మళ్ళింది. రగ్గు కప్పుకున్నాడు. రాత్రిపూట అరిచే పిట్టలు... బహుశా చక్రవాకాలు అవీ... ..విపరీతంగా గోడవ చేస్తున్నాయి. 'కంయ్‌ం'—మంటూ ఏదో పక్షి గొంతు బిగబట్టింది. ఆ వెన్నెట్లో ఆ కొంచెలు...... వాగు... చెట్లు....గుబుర్లు......అన్నీ చేతులు చాచిన జీబూతాల్లా భయపెడుతున్నాయి. కీచురాళ్ళ శబ్దం. సత్యం ఉన్నా ఒంటరితనమే బాధించి, భయపెడు తోంది.

తప్పకుండా పులి తిరిగివస్తుంది. తను దాచు కున్న శవందగ్గరకు వచ్చి తృప్తిదీరా తింటుంది అంటాడు సత్యం.

అబ్బ! చలి...చలి...

మస్యమస్య గాస్ బయటకు వస్తోంది కాబోలు-వాసన భరించటం కష్టంగా ఉంది. ఉండి ఉండి గాలి యీవైపు మళ్ళితే వాసన నాసికారంధ్రాలు బ్రద్దల య్యేటట్లు వస్తోంది. ముక్కుమీదుగా జేబురుమాలు కట్టాడు.

నిండా ముసుగు వేసుకొని సిగరెట్టు కాల్చాడు. మంట బయటకు కనుపించకూడదన్నాడు సత్యం. సిగ రెట్టు లోపలనే ఉంచి పొగపీల్చి, గుండెనిండుగా లాక్కొని వదలేస్తున్నాడు. కొంచెం వెచ్చగా ఉంది.

ఎక్కడనుంచో గట్టిగా ఏదో బూరా ఊదారు. గేదెకొమ్ము అయిఉంటుంది. కొమ్ము రెండు ప్రక్కలా నరికి ఊదితే మంచినాదం వస్తుంది. చలిలో మ్రోగే మాదిగ డప్పుల్లా, గుడ్డకప్పి బాదినట్లు ఏదో శబ్దం వినవస్తోంది. గొడ్లదగ్గర, దొడ్లవద్ద కాపలా పడు కున్నవారు నిద్రపోయేముందు వాయిస్తున్నట్లు న్నారు.

బోడి గుర్తుకు వచ్చింది సుందరానికి. ఏదో ఒక విలువైన వస్తువు పోగొట్టకున్నట్లుగా ఉంది. ఒక్క సారి ఆత్మవిమర్శ చేసుకున్నాడు. బోడిని తను ప్రేమించలేదు; కామించలేదు. తనకా కోరిక ఏ మూలనన్నా ఉందా? లేదు మరి. బోడికీ తనకు మధ్య చాలా మెట్లున్నాయి. తనీ మెట్లన్నీ దిగి బోడిని కలుసుకోలేడు. బోడి కూడా ఈ మెట్లన్నీ ఎక్కి యీ అందనిపండుకోసం అర్రులు చాచే రకం కాదు. కాని తిన్నెంగు చేతనో బోడి అంటే, ఎందుకో యింత ఆపేక్ష చూపిస్తున్నాడు.

విచిత్రవసువులా ఉంది. సత్యాన్ని తప్పబట్టాడు గాని, తనలాగే అభిమానిస్తూ ఉండాలి.

చీకటి రొద: కీచురాళ్ళ ధ్వని: ఎముకలు కొరికే చలి.

ఆకాశంమీద నక్షత్రాలు మిలమిలా మెరుస్తు న్నాయి. వాటిని చూస్తూంటే, మేడపై అంతస్తు మీద పండు వెన్నెట్లో, ప్రణయ సల్లాపా లాడుతూ భార్యతో గడపినదృశ్యం గుర్తుకొచ్చింది. చంటిపిల్లాడితో యీ అర్ధరాత్రి ఆ అమాయకురాలు పడుకొని ఉంటుంది. తను లేనిలోటు తప్పకుండా అనుభవించే ఉంటుంది. "ఎందుకీ పాడు వేట— చెబితే వింటూరా!" బహుశా పిచ్చిప్రేమలో హృద యంలో అలా కసురుకునే ఉంటుంది. అర్ధరాత్రి కదూ! పిల్లాడు లేచి పాలకోసం ఏడుస్తూ ఉండాలి. చిలిపివెధవ వాడిచేతులు, కాళ్లు క్షణం ఊరుకోవు. ముక్కు మొహం పీకిపెడతాడు—ఎత్తుకుంటే. ఇంట్లో అడుగు పెట్టగానే కాళ్లలోపడి పాకుతూ బోసి నోటితో నవ్వుతాడు. తనెత్తుకోక ఒకడుగు ముందుకు వేసేవాడు. వాడు గబగబ పాకేవాడు. ఇంకా ఎత్తుకోకపోతే ఏడ్చేవాడు. ఇది చూచి తన భార్య పక్కన నవ్వేది. దాని ఉద్దేశం తను ఓడిపోయా నని, వాడు గెలిచాడని.

నిజంగా యీఅర్ధరాత్రి తనకేమైనా జరిగితే వాళ్లగతేమిటి?...వళ్ళు గగుర్పొడిచింది.

దాసీదాన్ని యింటిదగ్గర పడుకోమని, గట్టి గానే చెప్పివచ్చాడు. వెంకడిని కూడా పడుకో మన్నాడు. వాళ్ళు రాలేదేమో! బితుకు, బితుకు మంటూ ఒక్కతే పడుకుందేమో!....వచ్చే ఉంటారు! అయినా ఏమిటీ గ్యారెంటీ!

తీతువపిట్ట అరచింది. అది జంకువు నంటి పెట్టుకొని అరుస్తూ ముందువస్తుంది. పులికి తప్ప కుండా ముందుఉంటుంది.

చెట్టుక్రింద చూచాడు. ఏదో జంతువ పాకిపో తోంది. సత్యం చూచికూడా ఊరుకున్నాడు. చాలా సేపటికిగాని దాన్ని పోల్చుకోలేకపోయాడు — దుమ్ములగొండి. పులిచారలుంటాయి... పులికాదు. కుక్కమూతి ... కుక్క కాదు. జల్లితోక ... కాని

నక్క కాదు. ముందు కాళ్ళు పొడుగు; వెనుక కాళ్ళు పొట్టి. వికారంగా నవ్వుతుంది. క్రూరమైన జంతువు కాదు కాని, చిన్న చిన్న పిల్లలనయితే చంపేస్తుంది. పరుగెత్తలేదు. స్వయంగా జంతువను చంపలేదు; కాని చచ్చిన జంతువులను తింటుంది—నక్కలతో చేరి. పండ్లు చాలాగట్టివి. ఎంతలావు దుమ్ము(ఎముక) నైనా పటపట నమిలేస్తుంది. దానిది కూడా ఒక జీవితమే మరి. శవం దగ్గరకు, నక్కలను తోసుకుంటూ చేరింది.

అబ్బ! విషపుగాలి. శవంమీదనుంచి వస్తోంది.

సత్యంకేసి చూచాడు. బహుశా సత్యంకూడా తనకులాగే ఏదో ఆలోచిస్తూ ఉంటాడు. వేటగురించి అయి ఉంటుంది. వేటంటే గుర్తుకొచ్చింది. వచ్చేటప్పుడు వేటకు సంబంధించిన పుస్తకాలిన్ని కొని, తెచ్చుకొని, చదివాడు. ఎందరెందరో ప్రముఖ వేటకాళ్లు, మానుపులలవల్ల ఎలా చంపబడ్డది కూడా చదివాడు. మానుపులులు మహా తెలివిగా ఉంటాయట.

మంత్రాలు నేర్చుకొని, మనుష్యరక్తం చవిచూచి, దాహం తీరక, కొందరు కోయలు యిలా మానుపులులవుతారట. సగం మనిషి, సగం పులిగా ఉంటారు. తుపాకిగుండు వాళ్లి నేమీ చేయదట. చిత్రవిచిత్రాలు చేస్తారట.

ఈ చెట్టుమీద ఎన్ని పాములున్నాయో! చెట్టురుకు పాములు చెట్ల ఆకుల్లో కలసిపోయి ఉంటాయట. అవి పగకూడా పడతాయట. చాలా ప్రమాదమట కూడాను.

"ఇదంతా ఎందుకు. తనకీ వేళ ఆఖరురోజు".— మరోసారి జ్ఞాపకానికి రాగానే, గజ్జున వణకిపోయాడు.

ఎక్కడా పులిజాడ లేదు.

సిగరెట్టు కాల్చుకుందామని ముసుగు వేసుకున్నాడు. అగ్గిపుల్ల గీశాడు. తీతువు తెగ అరిచింది. మేక అరిచింది. ముసుగు జారిపోయింది. భయోత్పాతం వల్ల జుట్టంతా నిక్కబొడుచుకుంది. వళ్ళంతా సూదులు గ్రుచ్చినట్లుగా ఉంది. మేక యింకొగట్టిగా అరచింది. రగ్గు జారిపోయింది, గుండె దిగజారిపోయింది. అంత చలిలోకూడా ముచ్చెమటలు పోశాయి.

సత్యం వేళ్ళు మీటమీద సిద్ధం అంటున్నాయి కంళ్లు గబగబా వెతుకుతున్నాయి.

సమయం గడచిపోతోంది. పులి జాడ లేదు. అనుమానపడితే మళ్లీ రాదన్నాడు సత్యం. అందుకే మాటు కట్టటానికి అక్కడివి చెట్టుగాని, పుట్టగాని కొట్టటానికి వీల్లేదన్నాడు. సహజత్వానికి ఏమాత్రం భిన్న మొచ్చినా పులి కనిపెడుతుందట.

మేక పడుకుంది. పులి రాలేదా! మరి మేక ఎందుకలా అరచింది. నల్లగా చీకట్లో పడుకుంది. ఎద్దుకేసి చూచాడు. నిశ్చింతగా పడుకొని నెమరు వేస్తోంది.

అప్పుడు ఆ నిశ్శబ్ద నిశీథ వాతావరణాన్ని చీల్చుకుంటూ, కర్ణానందంగా, ఎక్కడినుంచో, మధుర మంజులగానం వినిపిస్తోంది, సుందరానికి. ఎత్తైన కొండమీదనుండి పడుతూ, లేస్తూ, పరుగెత్తుతూ, ప్రవహిస్తూ వచ్చే సెలయేరులా ఆరోహణ, అవరోహణాలతో అతి గంభీరంగా ఉంది. ఒంటరిగా ఉండలేక జంటకోసం విలపించే కోకిల కూజితంలా మృదువుగా ఉంది.

ఎవరీ కమనీయ గాత్రి!

ఒకవేళ యిదే హిమవత్పర్వత సానువు లనుకొని ప్రవరాఖ్యునికోసం అలపిస్తున్నదా— వరూధిని భువికి దిగి. లేక కలస్వనంతో ఏడుస్తున్నదా— విరహం భరించలేక. గాంధర్వ కన్యకల ఏడుపుకూడా కమ్మగా ఉంటుందట. అంత తియ్యగా ఉంది మరి.

ఎక్కడిదీ కమ్మని కంఠం.

ఇంత అర్ధరాత్రి యీ మారుమూల, కుగ్రామాల్లో, యీ పూరిపాకల్లో యింత కమ్మగా, తియ్యగా పాడే దెవరీ వరవర్ణిని. ఎక్కడినుంచి వచ్చి యిక్కడ స్థావరం ఏర్పరచుకుందో యీ వరారోహ!

అహా! ఎంత తియ్యని గొంతు.

కవి కుమారుని హృదయం కళవళపడుతోంది.

అదే రాగం...అదే గొంతు...వీనుల విందుగా వినిపిస్తోంది. మనస్సు నుయ్యాల లూపిస్తున్నది. మైమరపిస్తోంది. ఆ గానమాధుర్యానికి పరవశుడై పోతున్నాడు సుందరం. భావంగాని..కూర్పుగాని... ఏమీ వినిపించటంలేదు. హృదయాన్ని జోకొట్టే ఆలాపన.

అబ్బ! ఎక్కడిదీ మధుర మంజులగానం.

అర్ధరాత్రి లేచిన ముద్దుబిడ్డకు పాలిచ్చి జోకొట్టే మాతృమూర్తి ప్రేమపూరితమైన జోలపాటా!...చిరునవ్వు వెన్నెలలు చిందిస్తూ, చిట్టడుగులు వేస్తూంటే చిరుగజ్జెలు ఘల్లు, ఘల్లుమంటూంటే కుమారుని ముద్దు చేష్టలకు బోసినవ్వుల కానందపరవశరాయై తనివితీర, కౌగలించుకొని, తీయతీయని ముద్దులవర్షం కురిపిస్తూ, ముగ్ధరాలైన ప్రేమస్వరూపిణి హృదయతంత్రులన్నీ జల్లుమని ఆలాపిస్తున్నాయా ! ... ... ధన్యమయింది స్త్రీజన్మ.

తనిప్పుడొక దివ్యస్వప్నం కంటున్నట్లుగా ఉంది. ప్రేయసి వలపులు క్రుమ్మరిస్తూ, ఒక చేతి వేళ్లు వంచి, వయ్యారంగా, హృదయపూర్వకంగా, అర్ధనిమీలిత నేత్రయై, పరవశయై, క్రీగంటితో, "ఒకసారి ఇట్లా రావూ!...." సైగతో పిలచినట్లుగా ఉంది. పులకరింపు పుడుతోంది.

ఛల్లున తెల్లవారింది.

ఆ గాంధర్వ గాత్రి ఎవరో తెలుసుకోవాలన్న కోరిక తీవ్రంగా బాధిస్తోంది. ఆ కంఠమాధుర్యాన్ని బట్టి ఆవిడ తప్పకుండా అప్సరస అయిఉండాలి. అన్నమంతా పట్టి చూడనక్కరలేదు. అపురూప సౌందర్యవతి అయిఉంటుంది. అందులో సందేహం కూడానా! ఇద్దరూ ఇళ్లకు మళ్లారు.

ఉద్రేకంతో అడిగాడు సుందరం: "పాట విన్నావా?..."

"ఏంపాట?" అనుమానంతో అడిగాడు సత్యం.

"అరె! మరి రాత్రి వినిపించినపాట నువు వినలేదన్నమాట."

"అదా!...అది పాట కాదురా!....ఏడుపు...."

"ఆఁ..." -కుప్పగా కూలిపోయాడు సుందరం.

*   *   *   *

కోయవాళ్లు ఏడుస్తూఉంటే, దూరంగా ఉన్న క్రొత్తవాళ్లకి ఎంతో కమ్మగా పాడినట్లు వినుపిస్తుంది. మన ఏడుపులా ఉండదు. ఇది అనుభవంమీదకాని తెలియదు.

సుందరానికి అనుమానం తీరక ఆరాతీస్తే ఆ సాయంత్రమే వచ్చిన బోడిఅక్క అర్ధరాత్రి దుఃఖం పట్టలేక భోరుభోరున ఏడ్చిందట.